విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :150 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 17 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## పిల్లల సోషల్ మీడియా భద్రత

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన
- తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

# స్థానిక సమరానికి టీడీపీ సై

- అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం
- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం
- సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత
- మేయర్లు, ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ
- ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి - మిగతా3లో



## కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

- కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్
- ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదు

## అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించా



- దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రిని సందర్శించారు
- భక్తుల కేరింతలకు సీఎం స్పందించి వారికి ఆత్మీయంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు.
- ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు



## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్
- అభిజీత్ దీప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారు
- ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య



## బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర

- రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు
- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలపై రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- అధికారం కోసమే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు

# రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు



- ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ, వైసీపీ
- స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ రాయలసీమలో ఘర్షణలు
- దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు పాల్పడ్డారని ఆరోపణ
- టీడీపీ నాయకులే దాడులకు పాల్పడ్డారని వైసీపీ నేతలు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాయలసీమలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ, ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ టీడీపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు శుక్రవారం ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. రాయలసీమలోని పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతి - మిగతా3లో




## అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

- మోదీ కోరుకుంటే నేనే వివరిస్తా
- అమెరికా మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రూబియో ముంబయిలో భారత అధికారులతో సమావేశం
- కానున్న నేపథ్యంలో విదేశాంగ శాఖలోనే గందరగోళం నెలకొంది

# గోదావరి-కావేరి అనుసంధానం సాధ్యమేనా?

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత జోసెఫ్ విజయ్‌ల మధ్య జరిగిన సమావేశం దక్షిణ భారత రాజకీయ, జలవనరుల వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. చారిత్రకంగా చెన్నై నగర తాగునీటి అవసరాల కోసం ఏపీ నుంచి అందించే తెలుగు గంగ నీటి సరఫరాపై ఈ భేటీలో ప్రాథమిక చర్చలు జరిగినప్పటికీ, అసలు సిసలైన కీలక అంశం మాత్రం గోదావరి-కావేరి నదుల అనుసంధానంపైనే నడిచింది. నదుల అనుసంధానంపై సుదీర్ఘకాలంగా స్పష్టమైన ప్రణాళికలతో ఉన్న చంద్రబాబుతో, తమిళనాడు సీఎంగా పగ్గాలు చేపట్టిన విజయ్ ఈ సుదూర జల కల నెరవేర్చేందుకు చేతులు కలపడం అంతర్రాష్ట్ర జల సంబంధాలలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.కావేరి జలాల పంపిణీ విషయంలో కర్ణాటకతో తమిళనాడు దశాబ్దాలుగా వివాదాలను ఎదుర్కొంటోంది. ఈ శాశ్వత నీటి సంక్షోభానికి నాటి ప్రాజెక్టులే పరిష్కారమని భావిస్తున్న సీఎం విజయ్ ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసి ఒక ప్రతిపాదనను సమర్పించారు. స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయుడు కూడా జాతీయ నదుల అనుసంధానానికి మొదటి నుంచీ గట్టి మద్దతుదారుడిగా ఉండటంతో, ఇద్దరు పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ డ్రీమ్ ప్రాజెక్టుపై ఒకే తాటిపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.అసలు గోదావరి-కావేరి అనుసంధానం సాధ్యమేనా అనే ప్రశ్న టెక్నికల్, లీగల్ వర్గాల్లో తలెత్తుతోంది. కేంద్ర జలసంఘం , నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాథమిక నివేదికల ప్రకారం, సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి మిగులు జలాలను కృష్ణా, పెన్నా నదుల ద్వారా కావేరి నదికి మళ్లించడం సాంకేతికంగా సాధ్యమే. గోదావరి బేసిన్‌లోని ఇచ్చంపల్లి, సమ్మక్క బ్యారేజీ లేదా పోలవరం జలాశయం నుంచి దాదాపు 147 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్, సోమశిల, నాగార్జునసాగర్ రైట్ కెనాల్, గ్రావిటీ, లిఫ్ట్ పద్ధతుల ద్వారా తమిళనాడులోని గ్రాండ్ ఆనకట్ట వరకు తీసుకెళ్లేలా రూ. 60,000 కోట్లకు పైగా వ్యయంతో డిజైన్లు సిద్ధం చేశారు. ఈ



ప్రాజెక్టు నెరవేరితే దక్షిణ భారతదేశంలోని నాలుగు ప్రధాన రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మరియు పుదుచ్చేరిలకు అపారమైన ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఏపీలోని రాయలసీమ, ప్రకాశం , నెల్లూరు జిల్లాల కరువు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు విస్తారంగా లభిస్తాయి. అదే సమయంలో ఏటా తీవ్ర కరవును, తాగునీటి కొరతను ఎదుర్కొంటున్న తమిళనాడులోని డెల్టా జిల్లాలకు , చెన్నై నగర దాహార్తికి కావేరి అనుసంధానంతో శాశ్వత ఉపశమనం లభిస్తుంది. పంట కాలాల్లో కర్ణాటకపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టు ఆచరణలోకి రావడానికి ప్రధానంగా మూడు పెద్ద సవాళ్లు అడ్డుగా నిలుస్తున్నాయి. మొదటిది అంతర్రాష్ట్ర జల వివాదాలు. గోదావరిలో మిగులు జలాలు లేవని, ముందస్తుగా తమ నీటి అవసరాలను తీర్చాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా, డిజైన్ల మార్పులపై ఏపీ తనదైన శైలిలో సూచనలు చేస్తోంది. రెండవది భారీ ఆర్థిక భారం. పదుల వేల కోట్లతో కూడుకున్న ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. మూడవది అటవీ, పర్యావరణ అనుమతులు , వేల ఎకరాల భూసేకరణ అవసరం ఉంటుంది. దక్షిణ భారతదేశాన్ని సుభిక్షం చేసే ఈ చారిత్రక ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి చంద్రబాబు అనుభవం, విజయ్ రాజకీయ పట్టుదల కలవడం శుభపరిణామం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఏపీ, తమిళనాడుల సంయుక్త విజ్ఞప్తుల ఆధారంగా ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేసి, నిధులు కేటాయిస్తేనే ఈ బృహత్తర జల యజ్ఞం కాగితాల నుంచి క్షేత్రస్థాయిలోకి దిగుతుంది. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య జరిగిన ఈ చర్చలు రాబోయే రోజుల్లో ఢిల్లీ స్థాయిలో ఎలాంటి కదలిక తెస్తాయో చూడాలి.

# స్థానిక పోరులో బలమైన వ్యూహం

# ఓటు బదిలీ సాధ్యమేనా?

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ, మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికల వేళ అధికార ఎన్డీయే కూటమిలోని ప్రధాన భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఆధిపత్య పోరు రచ్చకెక్కుతోంది. క్షేత్రస్థాయిలో తమ గ్రాఫ్ , ఓటు బ్యాంక్ అత్యంత బలంగా ఉందని రెండు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వాలు గట్టిగా నమ్ముతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించామన్న ధీమాతో జనసేన 40 శాతం స్థానాలను డిమాండ్ చేస్తుంటే.. దశాబ్దాల క్షేత్రస్థాయి కేడర్ బలం తమకే ఉందంటూ టీడీపీ స్థానిక నాయకులు ప్రతిఘటిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం పార్టీ బలం లేదా అడిగినన్ని సీట్లు కేటాయించడం మాత్రమే ముఖ్యం కాదు. డివిజన్, వార్డు , గ్రామీణ స్థాయిలో కచ్చితంగా గెలిచే ఆధిపత్యం ఉన్న బలమైన అభ్యర్థులు బరిలో ఉన్నారా లేదా అనేదే అసలు సూత్రం. జనసేన కోరినన్ని స్థానాలు కేటాయించినప్పటికీ, విజయం సాకారం కాకపోతే అది అంతిమంగా కూటమి ప్రభుత్వ ప్రతిష్టకే భంగకరమని టీడీపీ అధిష్టానం భావిస్తోంది. అందువల్లే, కేవలం సీట్ల పంపిణీతో సరిపెట్టకుండా జనసేన తరఫున నిలబడే అభ్యర్థుల ఎంపిక, వారి జనాదరణ, విజయావకాశాలపై కూడా టీడీపీ లీడర్‌షిప్ సలహాలు, సూచనలు అందిస్తోంది.ఈ వ్యూహాత్మక సమీకరణాల్లో భాగంగానే బెజవాడ రాజకీయంలో కీలక నేత వంగవీటి రాధాకృష్ణ జనసేన తీర్థం పుచ్చుకోవడం వెనుక పెద్ద ప్లాన్ ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేకమైన సామాజిక, రాజకీయ అనుచరగణం ఉంది వంగవీటి రాధా లాంటి ఇమేజ్ ఉన్న నేత పార్టీలో ఉండటం వల్ల అటు కాపు సామాజిక వర్గంతో పాటు స్థానిక స్థానాల్లో కేడర్‌ను ఏకీకృతం చేయడం సులువవుతుందని భావించారు. కిందిస్థాయిలో పార్టీల మధ్య జరుగుతున్న ఈ ఆధిపత్య పోరాటాలు, అభ్యర్థుల మార్పిడులు, అధిష్టానాల సలహాలు సాధారణ కేడర్‌లో ఒకింత అసంతృప్తిని రాజేస్తున్నాయి. ఏళ్ల తరబడి




గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కోసం కష్టపడిన టీడీపీ, జనసేన స్థానిక నాయకులు తమ సీటు పొత్తులో భాగంగా ప్రత్యర్థి పార్టీకి పోతోందని తెలియగానే తీవ్ర విముఖత చూపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ రెండు పార్టీల అనుకూల హ్యాండిల్స్ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకుంటుండటం వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో ఓటు బదిలీ కి పెద్ద అడ్డంకిగా మారతాయా అన్న ఆందోళన కూటమి పెద్దలను వేధిస్తోంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో పొత్తు ధర్మం సాఫీగా పనిచేసినప్పటికీ, స్థానిక ఎన్నికలు సంపూర్ణంగా వ్యక్తిగత ప్రభావాలు, బంధుత్వాలు, ప్రాంతీయ విభేదాలపై ఆధారపడి ఉంటాయి. ఒక వార్డులో టీడీపీ అసమ్మతి వర్గం జనసేన అభ్యర్థికి సహకరించకపోవడం లేదా జనసేన కేడర్ టీడీపీ అభ్యర్థికి ఓటు వేయకపోవడం జరిగితే, అది నేరుగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీని స్థానిక స్థాయిలో కోలుకోకుండా దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు ఈ ఓట్ల బదిలీ సవాలుగా మారింది. ఏరికోరి అభ్యర్థులను బరిలోకి దింపినా, అసమ్మతి నాయకులను ప్రాథమిక దశలోనే ప్రసన్నం చేసుకోలేకపోతే క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థుల గెలుపు గుర్రాలు నీరుగారే అవకాశాలున్నాయి. అందుకే కేవలం సీట్ల సర్దుబాటే కాకుండా, రెండు పార్టీల స్థానిక కమిటీలను సంయుక్తంగా రంగంలోకి దించేలా సమన్వయ కమిటీల ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎన్నికల సమరం కూడా ప్రారంభమైనందున టీడీపీ-జనసేన అగ్రనాయకత్వం ఈ క్షేత్రస్థాయి అసమ్మతిని ఎలా చల్లారుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# విజయవాడ మేయర్ స్థానంపై ఉత్కంఠ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ బుధవారం జనసేన పార్టీలో చేరారు. ఆయనతో పాటు తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేన కండువా కప్పుకున్నారు. రాజధాని అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ మేయర్ రేసులో వంగవీటి రాధాకృష్ణ, తిరుపతి మేయర్ రేసులో ప్రణీత్ ప్రమోద్ జనసేన అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.వంగవీటి మోహనరంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరుబోతున్నారని నిన్నటి నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. విజయవాడలో పలుచోట్ల ఫ్లెక్సీలు సైతం కనిపించాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రాధాకృష్ణ జనసేనలో చేరారు. మొన్నటివరకూ రాధాకృష్ణ సతీమణికి జనసేన నుంచి విజయవాడ మేయర్ గా ఛాన్స్ ఇస్తారని చర్చ జరిగింది. అయితే విజయవాడ మేయర్ పదవి అన్ రిజర్వ్‌డ్‌గా ప్రకటించడంతో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు మొత్తం 123 ఉండగా.. 100 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వంగవీటి రాధాకృష్ణ ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన 2004లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008 లో ప్రజారాజ్యం పార్టీలో చేరగా, 2009 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయన టీడీపీలో చేరిన ఆయన అదే పార్టీలో కొనసాగారు. అయితే విజయవాడ నగర మేయర్ స్థానం అన్‌రిజర్వ్‌డ్‌గా కేటాయించడం, కూటమి పొత్తుల్లో భాగంగా ఈ మేయర్ పీఠాన్ని జనసేనకు కేటాయిస్తారనే నడిచింది. దాంతో వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారని విజయవాడలో, అటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం చంద్రబాబుతో జనసేన పార్టీ అగ్రనేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు కూడా పాల్గొని సీట్ల కేటాయింపు, పోటీ చేసే స్థానాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు..

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గాల్లో వైసీపీ విధ్వంసం సృష్టించిందంటూ వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా దాడులకు పాల్పడ్డారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ కార్యకర్తలు, ప్రజలపైకి కాన్వాయ్‌తో దూసుకెళ్లి భయానక వాతావరణం సృష్టించారని వర్ల రామయ్య ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో దృశ్యాలను వారు ఎన్నికల సంఘానికి ఆధారాలుగా సమర్పించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తోందని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ ఫిర్యాదుతో రాయలసీమలో స్థానిక ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

**మిథున్‌రెడ్డిపై టీడీపీ గూండాల దాడి.. వైఎస్సార్‌సీపీ సీరియస్**

ఎంపీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండించింది. టీడీపీ నేతలు.. దాడులు చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవలేక అక్రమమార్గంలో వెళ్తున్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారు. ఏపీలో శాంతి భద్రతలు విఫలమైందని ఆయన మండిపడ్డారు. “బందిపోటు దొంగల్లా టీడీపీ గూండాలు దాడులు చేస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై కర్రలు, రాళ్లతో దాడులు చేశారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైన మొదటిరోజే దాడులు చేస్తున్నారు” అని లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు.

**ఓటమి భయంతోనే దాడులు..**

విజయనగరం: ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్యులకే రక్షణ లేదని.. ఓటర్లను, అభ్యర్థులను భయపెట్టాలని చంద్రబాబు కుట్ర పన్నుతున్నారంటూ మండిపడ్డారు. చిత్తూరు జిల్లాలో ఎంపీ మిథున రెడ్డి పై దాడిని ఖండిస్తున్నాం. చంద్రబాబు దుష్ట పరిపాలనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఓటమి భయంతో వైఎస్సార్సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారు” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్యంలో నేడు చీకటి దినం**

చిత్తూరు: ప్రజాస్వామ్యంలో నేడు చీకటి దినం అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గం ఇంఛార్జ్ విజయానందరెడ్డి అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి హత్యాయత్నం ఘటనను తీవ్రంగా ఖండించారు, ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. దాడులను తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు.

## అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించా



వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దుర్గమ్మను ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రజల్లో పేదరికం పోవాలని, మెరుగైన జీవన ప్రమాణాలు కలగాలని కోరుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మూలానక్షత్రం రోజున పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించానని తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రిని సందర్శించారు. భక్తుల కేరింతలకు సీఎం స్పందించి వారికి ఆత్మీయంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట?ల శివప్రసాదశర్మ సీఎంకి పరివేష్టం అలంకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దుర్గమ్మకు పట్టువస్త్రాలు, ఇతర సుమంగళ ద్రవ్యాలను తీసుకుని ఆలయంలోకి వెళ్లిన సీఎం దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య సీఎం దంపతులు అమ్మవారి అంతరాలయంలోకి చేరుకున్నారు. సరస్వతిదేవి అలంకరణలోని దుర్గమ్మకు షోడషోపచారాలు చేసి ముఖ్యమంత్రి, కుటుంబ సభ్యుల గోత్రనామాలతో పూజ చేశారు. చతుర్వేద ఆశీర్వచనం: రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రతిపాదిత పథకాలు, అన్ని ప్రాజెక్టులు సత్ఫలితాలను ఇవ్వాలని దివ్యమైన, భవ్యమైన రాజధానిగా అమరావతి నిర్మాణం కావాలని పరిపాలనలో ఎలాంటి అవరోధాలు ఇబ్బందులు, ప్రతికూలతలు లేకుండా అమ్మవారి కరుణాకటాక్షాలను పాలకులకు అందించాలని పండితులు సంకల్పం చెప్పారు. అనంతరం పండితులు చతుర్వేద ఆశీర్వచనం చేసి ప్రసాదం అందించారు. దేవాదాయశాఖ తరఫున సీఎం దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని పాలక మండలి ఛైర్మన్, అధికారులు అందించారు. ఆలయం నుంచి వెలుపలికి వస్తూ క్షేత్రపాలకులు అభయ ఆంజనేయస్వామి, అపరాజితాదేవిని దర్శించుకున్నారు. అనాదిగా ఉన్న రావిచెట్టును చంద్రబాబు తాకి నమస్కరించారు. ఆలయం బయట గట్టుపై కూర్చుని అమ్మవారి ఆలయ శిఖరాన్ని దర్శించి చేతులు జోడించి మొక్కారు. పాలకమండలి సభ్యులు, ఇతరులతో సీఎం ఫొటోలు దిగారు. దుర్గమ్మను దర్శించుకున్న తర్వాత జై దుర్గాభవానీ అంటూ మూడుసార్లు నినదించిన సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రభుత్వం తరఫున దుర్గమ్మ తల్లికి చీర, సారె సమర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దసరా సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నా. భక్తులెవ్వరికీ ఇబ్బందులు లేకుండా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నందుకు ఆలయ సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇప్పటివరకూ 8 లక్షల మంది దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ నవరాత్రుల్లో మరింత మంది భక్తులు భవానీ మాతను దర్శించుకోనున్నారు. ఈ వేడుకలు మన సంస్కృతీ, సంప్రదాయలకు నిదర్శనం.'

సీఎం దంపతులు అరగంట సేపు ఆలయంలో ఉన్నప్పటికీ దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా ముఖమండం ముందు క్యూ మినహా అన్ని వరుసలు యథావిధిగా కొనసాగించారు. దర్శన అనంతరం బయటకొచ్చిన సీఎం క్యూలైన్లలో మహిళలతో ముచ్చటించారు. చిన్నారులను ఆత్మీయంగా పలకరించి ఉత్సాహపరిచారు.

## స్థానిక సమరానికి టీడీపీ సై..

-మొదటిపేజీ తరువాయి

తీసుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీకి సంబంధించి లోతైన విశ్లేషణ జరుపుతూ వడపోత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండటంతో అభ్యర్థుల ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కేవలం పార్టీ కేడర్‌లోనే కాకుండా ప్రజల్లో మంచి పేరున్న, బలమైన అభ్యర్థులకే పట్టం కట్టాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో వ్యక్తిగత ఇమేజ్ గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్న అంచనాతో అన్ని కోణాల్లో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక సంస్థల పాలన ప్రజల దైనందిన జీవితంతో ముడిపడి ఉంటుందని, అందుకే అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రజలకు అందించాలన్నది తమ లక్ష్యమని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ తమ పాలన ఉండేలా ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

# 50 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరిక.

- పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు.
- వాడపల్లి మాజీ ఎంపీటీసీ ఏపుగంటి వీర రాఘవులు ఆధ్వర్యంలో చేరికలు.



**కొత్తపేట, పెన్ సత్తా, అక్టోబర్ 16:**కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలు స్వాగతిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు పేర్కొన్నారు. వాడపల్లి మాజీ ఎంపీటీసీ ఏపుగంటి వీరరాఘవుల తో సహా 50 కుటుంబాలకు చెందినవారు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు సమక్షంలో శుక్రవారం వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ పసుపు కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగిన వెంటనే కోనసీమ తిరుమల వాడపల్లిలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో ఇంతమంది చేరడం స్వామివారి ఆశీస్సులు కూటమి ప్రభుత్వానికి ఉన్నాయనడానికి నిదర్శనం అన్నారు. తొలిసారిగా శాసనసభ్యునిగా పోటీ చేసినప్పటి నుంచి ఏ ఎన్నిక జరిగిన మొదట వాడపల్లి వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రచారం మొదలు పెట్టడం తనకు ఆనవాయితీ అని ఎమ్మెల్యే బండారు గుర్తుచేసుకున్నారు. వాడపల్లి మాజీ ఎంపీటీసీ వీరరాఘవులు వారి సహచర బృందం తెలుగుదేశంలో చేరడం చాలా సంతోషకరమన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ నడుస్తుందన్నారు. మరలా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించడం ద్వారా త్రిబుల్ ఇంజన్ సర్కార్ నడవాలని పట్టణాలను, గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు మూడు ఇంజన్లుగా ఒకే మాట మీద ఒకే బాటలో పయనించినప్పుడు మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలకు సేవ చేయడానికి, ప్రజలకు సంక్షేమం అందించడానికి గ్రామాలను అభివృద్ధి చేయడానికి కూటమి అభ్యర్థులే గెలవాలని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయతీలు, వార్డు సభ్యులతో సహా అన్నింటా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. 2029 లో సైతం ఎన్డీఏ కూటమే అధికారంలోకి తిరిగి రాబోతుందన్నారు. అందరూ కలిసి పనిచేసి ఎన్డీఏ కూటమి తరపున ఎవరికి అవకాశం ఇచ్చినా, ఎవరు పోటీ చేస్తున్నా అందరినీ గెలిపించుకోవాలని కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ),కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం, కూసుంపూడి రామకృష్ణరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూకాంబిక ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 16:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా శుక్రవారం నవరాత్రి సందర్భంగా అమ్మవారికి మాతృ తయోరాధన, చండీ హోమం నిర్వహించారు. మూలా నక్షత్ర సందర్భంగా అమ్మవారికి సరస్వతి దేవి పూజ ఘనంగా నిర్వహించారు. అన్న సమారాదాన్ని విరాళం దాతలు అట్లూరి లజపతిరాయ్ నాగజ్యోతి, వెలగంపూడి శ్రీనివాస్ లక్ష్మీకుమారి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాఘ్ర వాహిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కన్యకా పరమేశ్వరి.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 16:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం శుక్రవారం అమ్మవారు వ్యాఘ్ర వాహిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. ఆలయ మండపములో సువాసినుల పూజ లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుత రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు, తదిరులు పాల్గొన్నారు.



# మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం..ప్రభుత్వ దాడే



**కూటమి ప్రభుత్వ దాడులు, బెదిరింపులను తీవ్రంగా ఖండిస్తున్నాం**

**వైయస్ఆర్‌సీపీ ప్రచార విభాగం జోన్-3 అధ్యక్షురాలు మైలా రత్నకుమారి**

**కృష్ణా జిల్లా: పెన్ సత్తా, అక్టోబర్ 16:**పుంగనూరులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని వైయస్ఆర్‌సీపీ ప్రచార విభాగం జోన్-3 అధ్యక్షురాలు మైలా రత్నకుమారి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీని ఎదుర్కోలేకే కూటమి ప్రభుత్వం దాడులు, బెదిరింపులకు దిగుతోందని విమర్శించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా వైయస్ఆర్‌సీపీ నాయకులు, అభ్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని పేర్కొన్నారు.

పుంగనూరు నుంచి తాడిపత్రి, దాచేపల్లి, పత్తికొండ, రాయచోటి వరకు దాడులు, అక్రమ కేసులు, బెదిరింపులతో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ హక్కును అడ్డుకుంటున్నారని రత్నకుమారి ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమని, దాడులకు సహకరించిన వారితో పాటు బాధ్యులైన అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకుని నిష్పక్షపాత ఎన్నికలకు భరోసా కల్పించాలని, అవసరమైన ప్రాంతాల్లో పారామిలిటరీ బలగాలను మోహరించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ పోటీ చేసే హక్కు, ఓటు వేసే స్వేచ్ఛ ఉండాలని, అధికార బలంతో ప్రతిపక్ష అభ్యర్థులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. దాడులు, బెదిరింపులకు వైయస్ఆర్‌సీపీ భయపడబోదని, బాధితులకు న్యాయం జరిగే వరకు ఎన్నికల సంఘం, న్యాయస్థానాల ద్వారా చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని మైలా రత్నకుమారి వెల్లడించారు.

# జీవీఎంసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు.



**గాజువాక, పెన్ సత్తా, అక్టోబర్ 16:**జీవీఎంసీ స్థానిక ఎన్నికల నేపథ్యంలో గాజువాక జోనల్ కార్యాలయంలో 19 వార్డులకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతిపాదకులు, బలపరిచే వ్యక్తులకు మాత్రమే కార్యాలయం లోకి అనుమతి ఉంటుందని, మిగతా వారు 100 మీటర్ల పరిధికి అవతల ఉండాలని పోలీసులు సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## పరిషత్ ఎన్నికలకు ఈ నెల 21 నుండి నామినేషన్ల స్వీకరణ.

**సన్నద్ధత పై సమీక్షించిన సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి.**






**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబరు 16:** ఎం.పి.టి.సి, జెడ్. పి.టి.సి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఈ నెల 21 వ తేదీ నుండి స్వీకరించడం జరుగుతుందని, ఎన్నికలు నవంబర్ 3 న, ఓట్ల లెక్కింపు 5 వ తేదీన జరుగుతాయని సంయుక్త కలెక్టర్ జి.విద్యాధరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాట్లు పై జేసీ సమీక్షించారు. సజావుగా ఎన్నికల నిర్వహించుటకు గానూ నోడల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. డివిజనల్ స్థాయి లో ఆర్.డి. ఓ లు ఇంచార్జ్ లుగా వుంటారని, అసిస్టెంట్ అథారిటీ గా ఎం.పి.డి. ఓ లు వ్యవహరిస్తారని తెలిపారు. 203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడ మైందని, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కనీస వసతులు ఉండేలా పంచాయతీ రాజ్ ఎస్.ఈ చూడాలని సూచించారు. మోడల్ కోడ్ వెంటనే అమలు లోకి వస్తుందని తెలిపారు. పార్టీల ప్రతినిధుల ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. ఎన్నికల సామాగ్రిని, పోలింగ్ అధికారులను సిబ్బందిని నియమించడం జరిగిందని, వారికి శిక్షణలు కూడా వెంటనే ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల విధులలో స్వంత తెలివితేటలను వాడకూడదని, పనులన్నీ ఇచ్చిన గడువులోగానే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ. ఓ నారాయణ మూర్తి, డిప్యూటీ సి.ఈ. ఓ సందీప్, ఆర్.డి. ఓ దిలీప్ చక్రవర్తి, డి.ఈ. ఓ ప్రేమ్ కుమార్, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షి దేవి ఆలయంలో కుంకుమ పూజలు.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 16:** నిదానదొడ్డి లో వేంచేసియున్న శ్రీ కామాక్షి దేవి దసరా నవరాత్రి మహోత్సవాలు భాగంగా శుక్రవారం అమ్మవారు మూల నక్షత్రం సందర్భంగా భక్తులకు సరస్వతి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద స్వర్ణ హస్త కంకణ సన్మాన గ్రహీత సప్పాభారతి భగవతారిణి చే శ్రీ మధ్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర హరికథ గానం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్యనరసింహ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాస రావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకట రావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గ దేవి గా భక్తులకు దర్శనం.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 16:**గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు భాగంగా శుక్రవారం అర్చకులు అంపోలు గోపాల కృష్ణ శర్మ, అంపోలు రాంప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారు భక్తులకు కనకదుర్గ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శించుకున్న వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు). ఆలయం మండపంలో బొమ్మల కొలువు భక్తులు ఆకట్టుకుంది. మండపంలో మహిళలు సామూహిక సహస్రనామ పసుపు కొమ్ముల పూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శించు కొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

# సరస్వతి దేవి అలంకరణలో దుర్గమ్మ.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 16:**ప్రసిద్ధి చెందిన, గవరపాలెం శతకం పట్టు లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగ శుక్రవారం అమ్మవారి మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి దేవిగా అలంకరణ చేశారు. ఈ అలంకరణ ఉదయగిరి చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు కే హరినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి నిత్య పూజ్యులు, అభిషేకాలు జరిపారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయం వద్ద విద్యార్థులు విద్యార్థులకు సరస్వతి పూజ నిర్వహించి ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతులు పిల్లలకు పెన్ను పుస్తకాలు పంపిణీ చేశారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్పీలా గోవింద సత్యనారాయణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు అండ్ బ్రదర్స్ ఆర్థిక సహకారంతో మాల ధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, దాడి నాగభూషణం, యాళ్ళ శ్రీను, విల్లూరి ఫణి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీగా అవకాశం ఇస్తే పూడిమడక అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా.

టీడీపీ సీనియర్ నేత పోన్నమళ్ళ కొండబాబు.



**అచ్యుతాపురం, పెన్ సత్తా, అక్టోబర్ 16:** పూడిమడక సెగ్మెంట్-1 పరిధిలో ఎంపీటీసీగా తనకు అవకాశం కల్పిస్తే ప్రాంత సమగ్ర అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తానని టీడీపీ సీనియర్ నేత పోన్నమళ్ళ కొండబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అచ్యుతాపురం లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి నిస్వార్థంగా సేవలందిస్తున్నానన్నారు. పార్టీలో అనేక కీలక పదవులు నిర్వహించానని గుర్తు చేశారు. 2009 లో తెలుగుదేశం పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా,
2014 లో టీడీపీ నియోజకవర్గ తెలుగునాడు ట్రేడ్ యూనియన్ (టిఎన్టియుసి) అధ్యక్షుడిగా,2019 నుండి ప్రస్తుతం జిల్లా టిఎన్టియుసి సెక్రటరీగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని తెలిపారు. పార్టీ అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయాని కైనా కట్టుబడి ఉంటానని, కూటమి ప్రభుత్వ విజయానికి, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. పూడిమడక ప్రజల ఆశీస్సులు, మీడియా మిత్రుల సహకారం ఎల్లప్పుడూ తనకు ఉండాలని ఈ సందర్భంగా కోరారు.

# ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరుల దౌర్జన్యాల పై కఠిన చర్యలు తప్పవు.



టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలి.
టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు.

**అమరావతి, అక్టోబర్ 16:** వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఆయన అనుచరుల దౌర్జన్యపూరిత వైఖరిని ఉపేక్షించే ప్రసక్తే లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు అడ్డుకట్ట వేయాలని, ఘటనల్లో బాధ్యుల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాజకీయ పలుకుబడిని అడ్డు పెట్టుకుని అరాచకాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.మిథున్ రెడ్డి, ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కుటుంబం గతంలోనూ దౌర్జన్యపూరితంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయని పల్లా పేర్కొన్నారు. పుంగనూరు ఘటనలో చోటుచేసుకున్న పరిణామాల పై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని పల్లా సూచించారు. ఎవరెంతగా రెచ్చగొట్టినా చట్టాన్ని గౌరవించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని స్పష్టం చేశారు.
గత ఐదేళ్లలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గొడ్డలిపార్టీ దౌర్జన్యాలకు పాల్పడి, ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థులకు అవకాశం లేకుండా చేసిందని విమర్శించారు. ఈసారి అలాంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కోరారు. నామినేషన్ల నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పే కీలకం కావాలి తప్ప, బెదిరింపులు, దౌర్జన్యాలు కాదు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని పల్లా శ్రీనివాస రావు స్పష్టం చేశారు.

# రాజకీయ కక్షతోనే నా కుమారుడిపై అక్రమ కేసులు

ఎన్ని బెదిరింపులు చేసినా భయపడేది లేదు: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**కర్నూలు: పెన్ సత్తా, అక్టోబర్ 16:**తన కుమారుడు రామోహన్‌రెడ్డిపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆరోపించారు. సత్యనారాయణ అనే వ్యక్తిని కిడ్నాప్ చేశారంటూ తన కుమారుడిపై కేసు పెట్టారని, అయితే సత్యనారాయణ తమ ఇంటికి వచ్చి వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ పోలీసులు తమ కుమారుడిపై కేసులు నమోదు చేయడం రాజకీయ కక్షసాధింపేనని విమర్శించారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా తనను బెదిరిస్తున్నారని శ్రీదేవి ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయలేక ఓటమి భయంతోనే వైయస్ఆర్‌సీపీ నాయకులపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. భర్తను కోల్పోయినప్పటికీ తనను నమ్ముకున్న ప్రజల కోసం రాజకీయాల్లో కొనసాగుతున్నానని, తనను అడ్డుకునేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చంద్రబాబు ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తోందని కంగాటి శ్రీదేవి మండిపడ్డారు. ఎన్ని బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



# పొత్తులో జనసేనకు సీటు.. కంటతడి పెట్టుకున్న ఏపీ మంత్రి



**అమరావతి :పెన్ సత్తా, అక్టోబర్ 16:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు కూటమి పార్టీల నాయకులకు తలనొప్పిగా మారుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా పదవులపై ఆశలు పెట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు పొత్తు కారణంగా మరో పార్టీకి ఆ స్థానం ఖరారు కావడం పట్ల అన్ని పార్టీల నాయకుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఏపీలో టీడీపీ , జనసేన, బీజేపీ పార్టీల మధ్య పొత్తు గత సాధారణ ఎన్నికల నుంచి కొనసాగుతుంది.
ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో నిష్పత్తి వారిగా సీట్లు కేటాయింపు అధిష్టాన నాయకుల మధ్య సజావుగా జరిగింది.అయితే ఏపీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్వతీపురం జిల్లాలోని సాలూరు మున్సిపల్ చైర్మన్ సీటును కనీసం 2 శాతం కూడా లేని జనసేనకు కేటాయించడంపై మంత్రి కంటనీరు పెట్టుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కేటాయింపులు అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం పునరాలోచించాలని శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో కోరారు

# వైసీపీ మాజీ మంత్రి సంచలన వ్యాఖ్యలు.. అధికారంలోకి రావడం ఖాయం, వడ్డీతో కలపి చెల్లిస్తాం

**అమరావతి : పెన్ సత్తా, అక్టోబర్ 16:**వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో వైసీపీ అధికారంలోకి రావడం ఖాయం. అప్పుడు వడ్డీతో కలిపి తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. గత ఎన్నికల్లో ఈవీఎం లు లేకపోతే వైఎస్ జగన్ చెప్పినట్లు వై నాట్ 175 సీట్లు వైసీపీ తప్పక గెలిచేదని అన్నారు. ఆ ఫలితాలు రాకుండా ఈవీఎంలు పనిచేశాయని ఆరోపించారు.
ఈసారి ఈవీఎంలు గాని, మరేదైనా పెట్టుకున్న వైసీపీ అధికారంలోకి వస్తుందని, జగన్ మోహన్‌రెడ్డి సీఎం అవుతారని ధీమాను వ్యక్తం చేశారు. పుంగనూరులో పోలీసులు కూడా గాయపడ్డారని తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ గూండాలు నామినేషన్ల కేంద్రాల వద్ద దాడులకు పాల్పడ్డారని, వైసీపీ అభ్యర్థుల పోటీ వల్ల తాము ఓడిపోతామన్న భయంతో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల పత్రాలను లాక్కున్నారని ఆరోపించారు.
పుంగనూరుకు బయట రాష్ట్రాల నుంచి వ్యక్తుల నుంచి తీసుకొచ్చి దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ, అధికారులు నీతివంతమైన పాలన బదులు బంట్రోతుల మాదిరిగా చంద్రబాబు చెప్పిన విధంగా పనిచేస్తున్నారని విమర్శించారు. అధికార పక్షానికి తొత్తులుగా పనిచేస్తున్న అధికారులకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు.



# పిల్లల సోషల్ మీడియా భద్రత

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ



తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

# కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో చేసిన విధంగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసుకునే ప్రయత్నం మరోసారి చేయొద్దని ప్రధానిని కోరారు. ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదని లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనుందని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఖర్గే లేఖ రాసినట్లు తెలుస్తోంది. "డీలిమిటేషన్‌పై ఏ రాజ్యాంగ సవరణ బిల్లునైనా తీసుకురావడానికి ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేను మీకు ఏప్రిల్ 11న మొదటిసారిగా లేఖ రాశాను. కానీ, మీరు అలా చేయలేదు. ఆ తర్వాత ఏప్రిల్ 14న అర్ధరాత్రి దాటిన తర్వాత మీరు బిల్లులను బయటపెట్టి ఏప్రిల్ 16న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్‌పై రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆ తర్వాత జూలై 16, ఆగస్టు 27న



అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మళ్లీ లేఖ రాశాను. ఇప్పుడు నేను నాల్గోసారి ఇలా రాస్తున్నాను. పార్లమెంటులో డీలిమిటేషన్‌పై కొత్త ప్రతిపాదనలను ఖరారు చేయడానికి ముందు వాటిపై సవివరంగా చర్చించడానికి దయచేసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి. అన్ని రాజకీయ పార్టీలకు తమలో తాము, ఒకరితో మరొకరు, ఇతర భాగస్వాములందరితో చర్చించుకోవడానికి తగినంత సమయం ఉండాలి. గతంలో మీరు చేసినట్లుగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేయడానికి మళ్లీ ప్రయత్నించవద్దు."

**నెలాఖరులో బిల్లులు పెట్టే అవకాశం**

ఇదిలా ఉండగా, ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అనేక వార్తలు వెలువడుతున్నా, అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అటు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వివాదం, సీజేపీ ఆందోళనల వల్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు ప్రత్యేక సమావేశాల్లో బిల్లులను ఆమోదించుకోవాలని భావిస్తోంది. అయితే, సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ ఈ బిల్లులు చర్చకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఒక రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల సంఖ్యాబలం (సుమారు 360 సీట్లు) వారికి లేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ బలం కాస్త పెరిగింది. ఈ బిల్లులకు మరింత మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డీఎంకే (ఐవీఖ) సహా పలు చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్న విషయంపై విదేశాంగ శాఖ అధికారులకే స్పష్టత లేదని విమర్శించారు. ఆ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని అన్నారు. ఒకవేళ మోదీ కోరుకుంటే తానే వివరిస్తానంటూ ఎక్స్‌లో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇటీవల రూబియో పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించిన నేపథ్యంలో రాహుల్ పలు వ్యాఖ్యలు చేశారు. వచ్చే వారం ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో రూబియో సమావేశమవుతారని, ఆ భేటీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నట్లు గోర్ తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్, భారత విదేశాంగ శాఖలోనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందంటూ కేంద్రంపై తాజాగా విమర్శలు గుప్పించారు.

**'అధికారులంతా అయోమయంలోనే!'**

మార్కో రూబియో తన ఉద్యోగిని ముంబయికి పిలిపించుకున్నారంటూ రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. విదేశాంగ శాఖలోని అధికారులు ఏం జరుగుతుందో తెలియక అయోమయంలో ఉన్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ విషయం గురించి మోదీ వివరించాల్సి ఉంటుందని, లేదంటే తానే వివరించాల్సి వస్తుందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎద్దేవా చేశారు రాహుల్ గాంధీ.

**'గోర్ ఎందుకు వెల్లడిస్తున్నారు?'**

అయితే రూబియో పర్యటనపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే




కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో రూబియో భేటీ గురించి అమెరికా రాయబారి వివరాలు వెల్లడించడంపై అభ్యంతరం తెలిపింది. ఇలాంటి విషయాలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించాల్సి ఉండగా, అమెరికా రాయబారి ఎందుకు వెల్లడిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత విదేశాంగ మంత్రి దేశంలో నిర్వహించే సమావేశాల వివరాలను ఇతరులు ప్రకటించడం అసాధారణమని ఆయన వ్యాఖ్యానించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని చెప్పడం ఒకటైతే, ఆ సమావేశానికి జైశంకర్ కూడా వస్తారని అమెరికా రాయబారి ప్రకటించడం మరో విషయమని పేర్కొన్నారు.

**అక్టోబర్ 17 నుంచి 22 వరకు పర్యటన**

బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరంలో జరిగిన చర్చ సందర్భంగా గోర్ ఆ వివరాలను వెల్లడించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశమవుతారని, ఢిల్లీ నుంచి మరికొందరు అధికారులు కూడా అక్కడికి వస్తారని చెప్పారు. జైశంకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రకటనే ఇప్పుడు కాంగ్రెస్ విమర్శలకు కారణమైంది. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, రూబియో అక్టోబర్ 17-22 వరకు ఉజ్బెకిస్థాన్, భారత్‌లో పర్యటించనున్నారు.

తొలుత ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌కు వెళ్లి, అక్కడ సెంట్రల్ ఆసియా దేశాలతో జరిగే సీ5ం1 మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత్‌కు వచ్చి ముంబయి, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో పర్యటిస్తారు. భారత్‌లో పర్యటన సందర్భంగా సీనియర్ ప్రభుత్వ అధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించనున్నారు. ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలపైనా చర్చలు జరపనున్నారు. వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులతోనూ రూబియో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడనున్నారు.

**వాణిజ్యం, ఇంధన రంగాలపై దృష్టి**

రూబియో పర్యటన రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా వ్యాపార సంబంధాలపైనా ప్రధానంగా దృష్టి పెట్టనుంది. భారత్- అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధన సహకారం, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాలు ఆ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత విస్తరించడం వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది మే 23 నుంచి 26 వరకు రూబియో భారత్‌లో పర్యటించారు. ఇప్పుడు ఆయన చేపట్టనున్న పర్యటన ఈ ఏడాదిలో రెండో అధికారిక పర్యటన కానుంది.

# రోజుకు రూ. 200 కోట్ల నష్టం..
# కన్నాట్ ప్లేస్ బంద్‌పై వ్యాపారుల ఆవేదన

'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ప్రతిపాదించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన కార్యక్రమం కారణంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సెంట్రల్ పార్క్‌ను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, ఈ మూసివేత వల్ల చిన్న వ్యాపారులపై పడే ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామంతో తమకు రోజుకు సుమారు రూ. 200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది జై అనంత్ దేహ్‌ద్రాయ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు నేడు వాదనలు వినిపించారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అర్ధరాత్రి వేళ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, పండగ సీజన్‌లో ఈ నిర్ణయం వల్ల వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయి, తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. "ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన వస్తుందని మేము ఆశిస్తున్నాము. పండగ రోజుల్లో చిన్న దుకాణదారులు తమ జీవనోపాధిని ఎలా సంపాదించుకుంటారో మాకు తెలుసు. వారి కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయి" అని



వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ.. నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉంటాయని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని తర్వాత తేలితే, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి కోర్టు నష్టపరిహారం ఇప్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో సంబంధిత పిటిషన్లు విచారణలో ఉన్నాయి. దసరా సెలవుల అనంతరం, అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం ఉంది.

## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర



కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ర్యాలీకి కొద్దిసేపటి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో నిరసన చేపట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అనుమతి లేదని, ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ర్యాలీకి ముందు అభిజీత్ దీప్కేను, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' (రెజీమ్ ఛేంజ్) పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

## బంగ్లాదేశ్ తరహాలో
## పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర..



బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించకుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

**అధికారం కోసమే అరాచకమా?**

ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. 'పాలన మార్పు' వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

**ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ..**

కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు. "1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్.. ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

## అవును, ప్రభుత్వాన్ని మార్చడమే మా లక్ష్యం
## ప్రశాంత్ భూషణ్ సంచలన వ్యాఖ్యలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనల వెనుక అసలు ఉద్దేశం ప్రభుత్వాన్ని మార్చడమేనన్న బీజేపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, సీనియర్ న్యాయవాది, నిరసనకారుల బృంద సభ్యుడు ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, "అవును, మేము ప్రభుత్వాన్ని మార్చాలనే కోరుకుంటున్నాం" అని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలతో నిరసనకారుల అంతర్గత ఎజెండా స్పష్టమైందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో ఏఐఎస్ఏ నాయకురాలు నేహా బోరా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేలతో కలిసి ప్రశాంత్ భూషణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. ఈ పోరాటం ఇప్పుడు నిజంగా ప్రభుత్వాన్ని మార్చడం కోసమే. ప్రభుత్వం ఇలాగే నిరంకుశంగా వ్యవహరిస్తే, కచ్చితంగా వ్యవస్థలో మార్పు వస్తుంది. గతంలో బీజేపీ కూడా అధికార మార్పిడి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టింది. ఇప్పుడు మేము చేస్తుంటే కుట్ర అని ఆరోపిస్తారా? ఈ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న సర్కారుపై మా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలపై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం లక్నోలో ఘాటుగా స్పందించారు. "అరాచక రాజకీయాల్లో యువతను పావులుగా మార్చాలని నిరసనకారులు కుట్ర పన్నుతున్నారు. బంగ్లాదేశ్ తరహాలో ఇక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చడమే వారి లక్ష్యం. వారిలో ఒకరు ఈ విషయాన్ని బహిరంగంగానే వెల్లడించారు, దీన్నిబట్టి వారి అసలు ఎజెండా తేటతెల్లమవుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలో అశాంతిని రేకెత్తించడం, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం మానుకోవాలని రాజ్ నాథ్ హితవు పలికారు. మరోవైపు, నిరసనకారుల బృందంలోని నేహా బోరా, బంగ్లాదేశ్‌లో జరిగిన యువజన ఉద్యమం తమకు స్ఫూర్తి అని పేర్కొన్న వీడియోను బీజేపీ ప్రధానాస్త్రంగా మలుచుకుంది.

## బిజినెస్

## రూ. 13.38 లక్షల కోట్ల పన్ను వసూళ్లు



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 14 వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా రూ. 13.38 లక్షల కోట్లకు చేరాయి. ఇది గత ఆర్థిక సంవత్సరంలో ఇదే వ్యవధితో పోలిస్తే 13 శాతం వృద్ధి కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 50 శాతం. కార్పొరేట్‌యేతర పన్ను చెల్లింపుదారులకు రిఫండ్‌లు 67 శాతం పెరిగినప్పటికీ, కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు 20.58 శాతం పెరగడంతో ఇది సాధ్యపడింది. కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) డేటా ప్రకారం సమీక్షాకాలంలో నికర కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రూ. 5.99 లక్షల కోట్లకు చేరగా, కార్పొరేట్‌యేతర ట్యాక్స్‌లు 5.83 శాతం పెరిగి రూ. 6.92 లక్షల కోట్లకు చేరాయి. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) ద్వారా రూ. 73,700 కోట్ల లక్ష్యం నిర్దేశించుకోగా, ప్రస్తుతం వసూళ్లు 52 శాతం ఎగిసి రూ. 46,840 కోట్లకు చేరాయి.

# ప్రపంచానికి 'ఏఐ వార్మ్'ల ముప్పు.. ముందే హెచ్చరిస్తున్న నిపుణులు!

టెక్నాలజీ ప్రపంచంలో సరికొత్త ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. 'ఏఐ వార్మ్' పేరుతో పిలుస్తున్న ఈ ముప్పు గురించి ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ తన ఫ్రాంటియర్ రెడ్ టీమ్ పరిశోధనలో హెచ్చరించింది. డేటా సెంటర్లతో సంబంధం లేకుండా, ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయిన సాధారణ గృహోపకరణాలలోకి చొరబడి, తమంతట తాముగా వ్యాపించగల సామర్థ్యం చిన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడళ్లకు త్వరలోనే రావచ్చని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇది ఇంటర్నెట్ భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.




**ఏమిటీ ఏఐ వార్మ్?**

సాధారణంగా కంప్యూటర్ వైరస్‌లు కోడ్ రూపంలో ఒక పరికరం నుంచి మరొకదానికి వ్యాపిస్తాయి. కానీ, ఏఐ వార్మ్‌లు దీనికి భిన్నం. వీటిని 'వెయిట్-బేస్డ్ రెప్లికేటర్లు' అని పిలుస్తున్నారు. అంటే, ఇవి కేవలం కోడ్‌ను కాకుండా, తమ ఏఐ మోడల్ బరువు (షవఅస్త్రప్రం) మొత్తాన్ని మోసుకెళతాయి. స్మార్ట్ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, సెక్యూరిటీ కెమెరాలు, చౌకైన ఆండ్రాయిడ్ టీవీ బాక్సుల వంటి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాలను లక్ష్యంగా చేసుకుని, వాటి హార్డ్‌వేర్‌పై తమను తాము ఇన్‌స్టాల్ చేసుకుంటాయి. అక్కడి నుంచి నెట్‌వర్క్‌లోని ఇతర పరికరాలకు వ్యాపిస్తాయి. వీటికి సెంట్రల్ కమాండ్ వ్యవస్థ ఉండదు కాబట్టి, ఒక్కసారి వ్యాపించడం మొదలుపెడితే వీటిని అరికట్టడం చాలా కష్టమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**పరిశోధనలో ఏం తేలింది?**

ఈ ముప్పుపై ఆంథ్రోపిక్ రెడ్ టీమ్ బృందం పలు ప్రయోగాలు నిర్వహించింది. గూగుల్‌కు చెందిన 'జెమ్మా 4' (26బీ పారామీటర్లు) మోడల్‌ను చౌకైన ఆండ్రాయిడ్ టీవీ బాక్సులపై విజయవంతంగా నడిపారు. అయితే, దాని వేగం చాలా నెమ్మదిగా (సెకనుకు 0.39 టోకెన్లు) ఉన్నట్లు గుర్తించారు. 30 బిలియన్ల కంటే తక్కువ పారామీటర్లు ఉన్న చిన్న ఏఐ మోడళ్లు ఇప్పటికే లక్ష్యాలను గుర్తించడం, యాక్సెస్ పొందడం, తమను తాము ఇన్‌స్టాల్ చేసుకోవడం వంటి పనులను విడివిడిగా చేయగలవని తేలింది. అయితే, ఈ ప్రక్రియలన్నింటినీ ఒకేసారి తప్పుల్లేకుండా పూర్తిచేసే సామర్థ్యం ప్రస్తుతానికి వాటికి లేదు. కానీ, ఏఐ మోడళ్ల అభివృద్ధి వేగాన్ని బట్టి చూస్తే, 2026 చివరి నాటికి ఈ సామర్థ్యాన్ని అవి అందుకోవచ్చని ఆంథ్రోపిక్ అంచనా వేస్తోంది.

**ముందస్తు హెచ్చరిక మాత్రమే**

ప్రస్తుతానికి ఇలాంటి 'ఏఐ వార్మ్'లు వాస్తవ ప్రపంచంలో ఇంకా ఆవిర్భవించలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా జరిపిన ప్రయోగాలు కూడా సులభతరం చేసిన నియంత్రిత వాతావరణంలో జరిగాయి. నిజ జీవితంలో వాటి వ్యాప్తి ఇంకా కష్టతరంగా ఉండొచ్చు. అయితే, ఈ పరిశోధనను ఒక ముందస్తు హెచ్చరికగా భావించాలని ఆంథ్రోపిక్ సూచించింది. భవిష్యత్తులో ఈ ముప్పును ఎదుర్కోవడానికి వినియోగదారులు, ఐఓటీ పరికరాల తయారీదారులు భద్రతా ప్రమాణాలను కఠినతరం చేయాలని పిలుపునిచ్చింది. డిఫాల్ట్ సెట్టింగ్స్‌ను మెరుగుపరచడం, అనవసరమైన పోర్ట్‌లను మూసివేయడం వంటి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

# జియోతో ఇంటర్నెట్ చౌక.. 6G సేవలపై ఎండీ ఆకాశ్ అంబానీ కీలక వ్యాఖ్యలు



ముంబై, అక్టోబర్ 15: జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా అందే నిధులను దాని అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ (ఆర్‌జీఐఎల్ లేదా జియో) అప్పులను తీర్చేందుకు వాడుతామని ఆ కంపెనీ ఎండీ ఆకాశ్ అంబానీ స్పష్టం చేశారు. బుధవారం జియో ప్లాట్‌ఫామ్స్ తమ ఐపీవో కోసం రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ లేదా ప్రాథమిక పత్రాలు) దాఖలు చేసిన నేపథ్యంలో గురువారం ఇక్కడ కంపెనీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ.. రూ.30,213 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూను తెస్తున్నామని, ఇందులో రూ.27,500 కోట్లదాకా జియోకున్న రుణాలను తీర్చేందుకే వినియోగిస్తామని వెల్లడించారు. తద్వారా జియో ప్లాట్‌ఫామ్స్ నికర రుణ రహిత సంస్థగా ఆవిర్భవించనుందన్నారు. అలాగే ఒక్కో టెలికాం వినియోగదారుడి నుంచి లభించే ఆదాయ సగటు (ఏఆర్‌పీయూ), 5జీ కస్టమర్ల సంఖ్యను పెంచడంపై దృష్టి పెడుతున్నట్టు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26) కంపెనీ స్థూల ఆదాయం సుమారు రూ.76,000 కోట్లుగా ఉన్నది. కాగా, ఈ నెల 21న మొదలై 23న ముగిసే జియో ఐపీవోలో షేర్ ధరల శ్రేణి రూ.1,065-1,119గా ఉన్నది. 27 కోట్ల షేర్ల ఫ్రెష్ ఇష్యూ జరుగుతున్నది. దీంతో ప్రస్తుతం దేశీయ ఐపీవో చరిత్రలో అగ్రస్థానంలో ఉన్న హ్యుందాయ్.. రెండో స్థానంలోకి వెళ్లనున్నది. షేర్ల లిస్టింగ్ ఈ నెల 28న ఉండే అవకాశాలుండగా.. సంస్థ విలువను దాదాపు రూ.10.3 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

**జియో డాటానే చౌక..**

ప్రపంచంలో మరే దేశంలోనూ.. ఏ సంస్థ కూడా జియో ఇస్తున్నట్టుగా ఇంటర్నెట్‌ను చౌకగా ఇవ్వడం లేదని ఆకాశ్ అంబానీ అన్నారు. ఒక్కో జీబీకి జియో వసూలు చేస్తున్న ధర చాలా తక్కువని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే భారత్‌ను డిజిటల్ వైపునకు నడిపిస్తుండటంలో జియో కీలకపాత్ర పోషిస్తున్నదని గుర్తుచేశారు. అలాగే 2030-31నాటికి 1.4 ట్రిలియన్ డాలర్ల భారత డిజిటల్ ఎకానమీ లక్ష్యంలో జియోదే మెజారిటీ వాటా అని కూడా చెప్పారు. ప్రస్తుతం జియో.. దేశీయ వైర్‌లెస్ డాటా రద్దీలో 60 శాతానికిపైగా కలిగి ఉన్నదని, ఈ ఏడాది జూన్ చివరికల్లా 53.3 కోట్ల కస్టమర్లున్నారన్నారు. ఇందులో 28.5 కోట్ల మంది 5జీ వినియోగదారులని పేర్కొన్నారు. చైనా తర్వాత భారత్‌లోనే 5జీ కస్టమర్లు ఎక్కువని చెప్పారు. ఈ ఏప్రిల్-జూన్‌లో ఒక్కో కస్టమర్ నెలవారీ సగటు డాటా వినియోగం 43.7 జీబీ ఉన్నదని వివరించారు.

**సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్లతో 6జీ**

జియో ప్లాట్‌ఫామ్స్.. కొత్తగా మళ్లీ మౌలిక వసతుల విస్తరణతో కాకుండా కేవలం సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్లతోనే తమ కస్టమర్లకు 6జీ సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆకాశ్ అంబానీ తెలిపారు. అలాగే 4 కోట్ల నుంచి 10 కోట్లకు హోమ్ బ్రాడ్‌బాండ్ కస్టమర్లను పెంచే దిశగా పరుగులు పెడుతున్నట్టు వివరించారు. దేశవ్యాప్తంగా జియోకు బలమైన నెట్‌వర్క్ ఉన్నదన్న ఆయన.. 3.6 లక్షల టెలికాం టవర్లు, 10 లక్షలకుపైగా కిలోమీటర్ల రూట్‌లో ఫైబర్ నెట్‌వర్క్ ఉన్నదని చెప్పారు. భారతీయ టెలికాం చరిత్రలో రిలయన్స్ జియో సృష్టించిన సంచలనాలు అన్నీఇన్నీ కావు.

# కివీస్‌తో పోరుకు సై..

## భారత వన్డే, టెస్టు జట్లు ఇవే!

న్యూజిలాండ్ పర్యటనకు వన్డే, టెస్టు జట్లను ప్రకటించిన బీసీసీఐ

టెస్టు సిరీస్‌తో పాటు, తొలి మూడు వన్డేలకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్

చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్‌కు సారథ్య బాధ్యతలు

టెస్టు జట్టులోకి రిషభ్ పంత్ పునరాగమనం, ఫిట్‌నెస్‌పై ఆధారపడి అవకాశం

వన్డే సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఎంపిక



న్యూజిలాండ్‌తో త్వరలో జరగనున్న సుదీర్ఘ పర్యటన కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) వన్డే, టెస్టు జట్లను ప్రకటించింది. టీ20 సిరీస్ ముగిసిన అనంతరం ఇరు జట్ల మధ్య ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లు జరగనున్నాయి. ఈ పర్యటనలో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. టెస్టు సిరీస్‌తో పాటు, వన్డే సిరీస్‌లోని తొలి మూడు మ్యాచ్‌లకు గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

ఆసక్తికరంగా, వన్డే సిరీస్‌కు రెండు వేర్వేరు జట్లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. తొలి మూడు వన్డేలకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు వన్డేలకు శ్రేయస్ అయ్యర్ జట్టును నడిపించనున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే సిరీస్‌కు ఎంపికయ్యారు. గాయం నుంచి కోలుకుంటున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. అయితే, అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది.

**తొలి మూడు వన్డేలకు భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ (ఫిట్‌నెస్‌పై ఆధారపడి), కుల్దీప్ యాదవ్.

**4, 5వ వన్డేలకు భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), మహమ్మద్ సిరాజ్, యశ్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్.

**టెస్టు సిరీస్‌కు భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్, ఫిట్‌నెస్‌పై ఆధారపడి), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అన్షుల్ కంబోజ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్.

**న్యూజిలాండ్ పర్యటన షెడ్యూల్**

వన్డే సిరీస్

| మ్యాచ్ | తేదీ | వేదిక | సమయం (భారత కాలమానం ప్రకారం) |
|---|---|---|---|
| 1వ వన్డే | నవంబర్ 04 | ఆక్లాండ్ | ఉదయం 7:30 గంటలకు |
| 2వ వన్డే | నవంబర్ 07 | వెల్లింగ్టన్ | ఉదయం 7:30 గంటలకు |
| 3వ వన్డే | నవంబర్ 10 | హామిల్టన్ | ఉదయం 7:30 గంటలకు |
| 4వ వన్డే | నవంబర్ 13 | మౌంట్ మాంగనూయి | ఉదయం 7:30 గంటలకు |
| 5వ వన్డే | నవంబర్ 15 | మౌంట్ మాంగనూయి | ఉదయం 7:30 గంటలకు |

టెస్టు సిరీస్

| మ్యాచ్ | తేదీ | వేదిక | సమయం (భారత కాలమానం ప్రకారం) |
|---|---|---|---|
| 1వ టెస్టు | నవంబర్ 19 | వెల్లింగ్టన్ | ఉదయం 3:30 గంటలకు |
| 2వ టెస్టు | నవంబర్ 27 | క్రైస్ట్‌చర్చ్ | ఉదయం 3:30 గంటలకు |

## స్పోర్ట్స్

## 19 పరుగులకే 4 వికెట్లు.. అయినా భారత్ అద్భుత విజయం



రాయ్‌పూర్ వేదికగా శుక్రవారం జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో భారత మహిళల జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. జింబాబ్వే బ్యాటర్లలో కెలిస్ ఎండ్‌లోవు (44 బంతుల్లో 42), షార్నే మేయర్స్ (33 బంతుల్లో 43 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో నందిని శర్మ రెండు వికెట్లు పడగొట్టగా.. షెఫాలీ వర్మ, అరుంధతి రెడ్డి, శ్రీచరణి తలా వికెట్ సాధించారు.

**అరంగేట్రంలో అదుర్స్**

అనంతరం 115 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు జింబాబ్వే రైటార్మ్ స్పిన్నర్ నిషా గ్వాంజురా బిగ్ షాకిచ్చింది. కెప్టెన్ స్మృతి మంధానతో పాటు షెఫాలీ వర్మ, అనుష్కశర్మ(4)లను ఆరంభంలోనే నిషా గ్వాంజురా పెవిలియన్‌కు పంపింది. మాజీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కూడా కేవలం ఒక్క పరుగు చేసి ఔటయ్యింది. దీంతో భారత్ కేవలం 19 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (49), అరంగేట్ర బ్యాటర్ నికి ప్రసాద్ (39 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. ఫలితంగా ఈ స్వల్ప లక్ష్యాన్ని ఉమెన్ ఇన్ బ్లూ 15.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily
శనివారం 17 అక్టోబర్ 2026

## సంపాదకీయం

# నిరసనకు చోటేదీ?

దేశ రాజధానిలో శాంతియుత నిరసనలకు దశాబ్దాలుగా వేదికగా ఉన్న జంతర్ మంతర్‌ను, నిరసన ప్రదేశంగా ఉన్న గుర్తింపు నుంచి తొలగించాలన్న ఢిల్లీ పోలీసుల నిర్ణయం, అది ఎంత ఏకపక్షమో ప్రశ్నిస్తూ పెద్ద నిరసనకే దారితీసింది. కేంద్ర హోం శాఖ అధీనంలోని ఢిల్లీ పోలీసులు, అక్టోబర్ 9న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశం తర్వాతే జంతర్ మంతర్‌ను 'డీనోటిఫై' చేశామని ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆ రోజు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ అక్టోబర్ 10న జరగాల్సిన నిరసనలను నిలువరించేందుకు నగరంలోకి, నగరం లోపల రాకపోకలపై కేంద్రం విధించిన ఆంక్షలను సవాలు చేసిన పిటిషన్లను విచారించింది. ఆ సందర్భంగా, ఢిల్లీలో దశాబ్దాలుగా జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల ఏర్పాటుపై పునరాలోచన అవసరమని, మెరుగైన సౌకర్యాలున్న, విశాలమైన, బహిరంగ ప్రత్యామ్నాయ వేదికను పోలీసు కమిషనర్, ఇతర సమర్థ అధికారులు పరిశీలించాలని కోర్టు సూచించిందని నివేదికలు చెబుతున్నాయి. ఆ మరుసటి రోజు, అక్టోబర్ 11న, ఢిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్ స్టాండింగ్ ఆర్డర్ జారీ చేసి, జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసి, రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్‌ను కొత్త నిరసన వేదికలుగా ప్రకటించారు. ఈ నిర్ణయంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, గురువారం (అక్టోబర్ 15) కేంద్రానికి, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. జంతర్ మంతర్ ఉపయోగం, సామర్థ్యంపై అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకున్నారా? అన్నది పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించినట్టు నివేదికలు తెలిపాయి.

ఈ వాదనలో కొంత నిజం ఉందన్నది అంగీకరించాల్సిందే. నిరసనల వల్ల ట్రాఫిక్ రద్దీ, సామాన్య ప్రయాణికులకు ఇబ్బంది కలగడం వాస్తవమే. కానీ ఇలాంటి వాదనలు, ప్రజాస్వామ్యంపైనే సాధారణంగా వినిపించే వాదనలంత మాత్రమే చెల్లుతాయి. ప్రజాస్వామ్యం నిర్ణయాలను ఆలస్యం చేస్తుందని, ఎన్నికలు అభివృద్ధికి, ఆర్థిక కార్యకలాపాలకు ఆటంకమని, కాబట్టి ఎన్నికలు, రాజకీయాలు తక్కువగా ఉండాలని చెప్పే ఒక ప్రతిగామి దృక్పథం ఉంది. పార్లమెంటుకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఐదేళ్లకు ఒకేసారి ఎన్నికలు జరపాలన్న బీజేపీ ప్రతిపాదనా అదే తర్కంపై ఆధారపడిందని, అది అంతిమంగా ప్రజాస్వామ్య చట్టబద్ధతనే ప్రశ్నించేదని ఈ విమర్శ చెబుతోంది. ఇదే తరహాలో, ప్రజా చర్చ, నిరసన ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువులు; జంతర్ మంతర్ వద్ద నిరసనలకు వ్యతిరేకంగా చేసే వాదన వాటికే విరుద్ధం. చాలా ప్రజాస్వామ్య దేశాల్లో నిరసన వేదిక నగరం నడిబొడ్డునే ఉంటుంది, వాషింగ్టన్ డీసీ, లండన్‌లో చూసినట్టు. నిరసనకారులు సాధారణంగా నిర్ణయ ప్రక్రియలో ప్రాతినిధ్యం లేని అట్టడుగు వర్గాలు; వీధి నిరసన వారి అధికార లేమికి ఫలితం, వేరే మార్గం లేనివారికి మాట వినిపించే సాధనం. అలాంటివారిని అధికార కేంద్రానికి దూరంగా నెట్టి, కనిపించకుండా చేయడం, వారి ప్రయత్నాన్నే అవమానించడమని విమర్శకులు అంటారు. జంతర్ మంతర్ పార్లమెంటు భవన సముదాయానికి, రాష్ట్రపతి భవనానికి దగ్గరగా ఉండటమే నిరసనకారులు అక్కడికి రావాలనుకోవడానికి కారణం. ప్రజా శాంతిభద్రతల పేరుతో వారిని నగరం అంచులకు నెట్టేస్తే, వారు తప్పించుకోవాలనుకునే పరిస్థితిలోనే మరింత చిక్కుకుపోతారు.

ఈ వివాదానికి చారిత్రక నేపథ్యం ఉంది. 2017లో జాతీయ హరిత ట్రైబ్యునల్ జంతర్ మంతర్ వద్ద నిరసనలను నిషేధించిన తర్వాత, 2018 జులైలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు (జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్ ధర్మాసనం) ఢిల్లీ పోలీసులు ప్రతి 60 రోజులకూ సెక్షన్ 144 ప్రకటిస్తూ రాజధాని మధ్య ప్రాంతంలో వాస్తవంగా "సమగ్ర నిషేధం" విధించడాన్ని తప్పుపట్టింది. రామ్‌లీలా మైదానం అందుబాటులో ఉందని గుర్తిస్తూనే, జంతర్ మంతర్ రోడ్డును నియంత్రిత పద్ధతిలో అందుబాటులో ఉంచాలని, సరైన మార్గదర్శకాలతో నిరసనలను క్రమబద్ధీకరించవచ్చు కానీ శాంతియుతంగా ప్రదర్శనలు చేసే ప్రాథమిక హక్కును పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. పాల్గొనేవారి సంఖ్యను నియంత్రించడం, పార్లమెంటు, సుప్రీంకోర్టు, ప్రముఖుల నివాసాల నుంచి కనీస దూరం వంటి నిబంధనలను మార్గదర్శకాల్లో చేర్చవచ్చని సూచించింది. అంటే రాజ్యాంగ న్యాయస్థానమే గతంలో సమతుల్యతను సూచించింది: నియంత్రణ అవును, నిషేధం కాదు. ఇప్పుడు అక్టోబర్ 11 ఉత్తర్వు ప్రత్యామ్నాయాలుగా ప్రకటించిన బురారీ, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ వంటివి కేంద్ర ప్రాంతానికి చాలా దూరంలో ఉన్నాయి; రామ్‌లీలా మైదానం ఇంతకుముందే అందుబాటులో ఉన్నా, అక్కడ నిరసనలకు కనిపించే ప్రభావం తక్కువ. పైగా, సుప్రీంకోర్టు సూచన "ప్రత్యామ్నాయ వేదికను పరిశీలించండి" అన్నది కాగా, పోలీసులు దాన్ని జంతర్ మంతర్‌ను పూర్తిగా తొలగించే నిర్ణయంగా మలిచారనే విమర్శ ఉంది. ఇది కూడా అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగిన భారీ నిర్బంధాలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల నిలిపివేత ఆరోపణలు, జర్నలిస్టులపై చర్యలపై వచ్చిన ఆరోపణల తర్వాత వచ్చింది; సుప్రీంకోర్టు ఆ విషయంలో కేంద్రానికి కోర్టు ధిక్కార నోటీసు కూడా జారీ చేసింది. ఈ క్రమంలో, భద్రత, సౌకర్యం పేరుతో నిరసన వేదికను తొలగించడం, అసమ్మతిని ప్రజల కంటినుంచి దూరం చేసే ప్రయత్నంగా కనిపిస్తుందన్న అనుమానాలు సహజం. పోలీసులు నిజంగా ప్రజల సౌకర్యం, నిరసనకారుల సౌకర్యాల మెరుగుదలనే లక్ష్యంగా పెట్టుకుంటే, జంతర్ మంతర్‌ను కొనసాగిస్తూనే, నియమాలతో కూడిన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, నీరు, నీడవంటి సౌకర్యాలు కల్పించవచ్చు; లేదా జంతర్ మంతర్‌కు దగ్గరగా సమానమైన ప్రభావం ఉండే, విశాలమైన ప్రదేశాన్ని ఎంపిక చేయవచ్చు. ఏ నిర్ణయమైనా నిరసనకారుల అభిప్రాయం, పారదర్శక ప్రక్రియ, స్పష్టమైన కారణాలతో జరగాలి. సుప్రీంకోర్టు ఇప్పుడు ఈ అంశాన్ని పరిశీలిస్తున్నందున, 2018 తీర్పు స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని, నిరసన హక్కు, ప్రజా సౌకర్యం మధ్య సరైన సమతుల్యతను నిర్దేశిస్తుందని ఆశిద్దాం. ఎందుకంటే, వినిపించే చోటు లేకపోతే, గళం అర్థరహితమవుతుంది; ప్రజాస్వామ్యంలో అసమ్మతికి చోటు ఉండాలి, కనిపించేంత దగ్గరలోనే ఉండాలి.

## పనికొచ్చే పలుకు



### అడ్డుపడుతున్నది.. పరిస్థితా? మీ ఆలోచనా?

జీవితంలో మనం అనుకున్నది సాధించలేకపోవడానికి ఎన్నో కారణాలు చెబుతుంటాం. 'నా వయసు అయిపోయింది', 'నా దగ్గర డబ్బు లేదు', 'నాకు సరైన అవకాశాలు రాలేదు', 'నాకంత టాలెంట్ లేదు', 'నన్ను ప్రోత్సహించేవాళ్లు ఎవరూ లేరు'.. ఇలా మన వైఫల్యాలకు ఒక్కో కారణాన్ని వెతుక్కుంటాం. వాటిలో కొన్ని నిజమైన సమస్యలు కావచ్చు. కానీ వాటన్నింటినీ అధిగమించలేని అడ్డుగోడలుగా భావించడమే అసలైన సమస్య. ఒక్కసారి ఆలోచించండి.. మీలాగే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవాళ్లు ఎంతోమంది జీవితంలో విజయం సాధిస్తున్నారు. మీ వయసులోనే కొత్తగా కెరీర్ ప్రారంభిస్తున్నవాళ్లు ఉన్నారు. ఎన్నోసార్లు విఫలమైనా మళ్లీ ప్రయత్నిస్తూ తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటున్నవాళ్లు ఉన్నారు. మరి వాళ్లకు లేని సౌకర్యాలు మీకూ లేకపోవచ్చు. వాళ్లకు ఎదురుకాని సమస్యలు మీకు ఎదురై ఉండవచ్చు. అయినప్పటికీ వాళ్లు ముందుకు వెళ్తున్నారంటే, మనం కూడా ప్రయత్నించడానికి అవకాశం ఉందనే కదా అర్థం! మీ పరిస్థితులు మీ ప్రయాణాన్ని కష్టతరం చేయవచ్చు. కానీ మీ ప్రయాణం ఎక్కడితో ముగియాలో అవే నిర్ణయించాల్సిన అవసరం లేదు.

ఇక్కడే మనం ఒక చిన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. వాస్తవిక పరిమితులు వేరు.. మనసులో మనం సృష్టించుకునే పరిమితులు వేరు. డబ్బు లేకపోవడం నిజమైన సమస్యే. కానీ డబ్బు లేదని కొత్త నైపుణ్యం నేర్చుకోవడానికి ప్రయత్నించకపోవడం మన నిర్ణయం. వయసు పెరగడం సహజం. కానీ వయసు పెరిగిందని ఇక కొత్తగా ఏమీ నేర్చుకోలేమనుకోవడం మన అపోహ. ఒకసారి విఫలమవడం వాస్తవం. కానీ మనం దేనికీ పనికిరామని నిర్ణయించుకోవడం మనం మనకు ఇచ్చుకునే తప్పుడు తీర్పు.

ముఖ్యంగా జెన్ జీ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ రోజుల్లో మన చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ప్రపంచవ్యాప్తంగా జ్ఞానం అందుబాటులో ఉంది. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి ఎన్నో అవకాశాలున్నాయి. అదే సమయంలో సోషల్ మీడియా మనలో పోలికలను, అసంతృప్తిని కూడా పెంచుతోంది. ఎవరో ఖరీదైన కారులో తిరుగుతుంటారు.. మరొకరు విదేశాల్లో చదువుకుంటుంటారు.. ఇంకొకరు చిన్న వయసులోనే లక్షలు సంపాదిస్తున్నట్లు కనిపిస్తారు. వాళ్ల హైలైట్స్ చూసి మన జీవితాన్ని తక్కువగా అంచనా వేసుకుంటాం. కానీ గుర్తుంచుకోండి.. ఇతరుల జీవితాల్లో కనిపించే ఫలితాలతో మీ జీవితంలోని ప్రారంభ దశను పోల్చుకోవడం న్యాయం కాదు. నిజానికి జీవితాన్ని మార్చేది వైరల్ రీల్ కాదు.. దాని తర్వాత మీరు తీసుకునే నిర్ణయం. ఒక గంట ప్రేరణ పొందడం కంటే, ప్రతిరోజూ ఇరవై నిమిషాలు ఒక కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం విలువైనది. పెద్ద లక్ష్యాన్ని ప్రకటించడం కంటే, ఈ రోజు దాని కోసం ఒక చిన్న అడుగు వేయడం ముఖ్యం. ఒక్కరోజులో అద్భుతం జరగాలని ఆశించడం కంటే, వంద రోజులు నిలకడగా ప్రయత్నించడం గొప్పది.

కాబట్టి మీ జీవితంలో మిమ్మల్ని వెనక్కి లాగుతున్న ఒక అంశాన్ని గుర్తించండి. అది భయమా? వాయిదా వేసే అలవాటా? ఆత్మవిశ్వాసం లేకపోవడమా? ఆర్థిక సమస్యా? దాన్ని స్పష్టంగా గుర్తించిన తర్వాత, దాని పరిష్కారం కోసం ఈ రోజే ఒక చిన్న పని మొదలుపెట్టండి. డబ్బు సమస్య అయితే ఆదాయాన్ని పెంచే నైపుణ్యంపై దృష్టి పెట్టండి. సమయం లేదనిపిస్తే, మీ రోజువారీ అలవాట్లను పరిశీలించండి. భయం అడ్డుపడుతుంటే, చిన్న ప్రయత్నంతో దాన్ని ఎదుర్కోండి. జీవితంలో అందరికీ ఒకే రకమైన అవకాశాలు ఉండవు. అందరికీ ఒకే వేగంతో విజయం కూడా రాదు. మీ ప్రయాణం మరొకరిలా ఉండాల్సిన అవసరం లేదు. మీరు నిన్నటి కంటే ఈ రోజు కొంచెం మెరుగ్గా ఉంటే చాలు. నెమ్మదిగా వెళ్లినా పర్వాలేదు.. ఆగిపోకండి. ఎందుకంటే, మీ జీవితాన్ని మార్చే మొదటి అడుగు పరిస్థితులు మారినప్పుడు కాదు.. మీ గురించి మీరు ఆలోచించే విధానం మారినప్పుడు మొదలవుతుంది.

# ద్రవ్యోల్బణం గుమ్మంలో సామాన్యుడు!



ఆదాయాల కంటే ధరలు వేగంగా పెరుగుతున్నప్పుడు, అసలే అరకొర సంపాదనతో బతుకుబండిని లాక్కొచ్చే సామాన్యుల కొనుగోలు శక్తి మరింత తగ్గిపోతుంది. అది పోషకాహార భద్రతను, జీవన నాణ్యతను దెబ్బతీసి ప్రజలను దుర్బలం చేస్తుంది. ధరల దెబ్బకు వినియోగం క్షీణించేకొద్దీ ఉత్పాదకత, ఉపాధి, ఆర్థిక వృద్ధిపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. వస్తు సేవల కోసం దేశీయ ప్రజానీకం వెచ్చించే మొత్తం భారత జీడీపీలో 61 శాతానికి పైగా ఉందన్న సంగతిని గుర్తుంచుకుంటే, వినియోగం తగ్గితే ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టమో అర్థమవుతుంది. అస్తవ్యస్త వాతావరణం, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసుల్లో అవాంతరాలు ఆహార, ఇంధన ధరలను మండిస్తున్నాయి. అవి పొదుపును మింగేస్తూ, ద్రవ్యోల్బణానికి కొత్త రెక్కలు తొడుగుతున్నాయి. ప్రభుత్వ గణాంకాల శాఖ (మోస్పీ) ప్రకారం, సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులోని 4.83 శాతం నుంచి 5.54 శాతానికి పెరిగింది; ఇది దాదాపు రెండేళ్ల గరిష్ఠం, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి నెలా పెరుగుతూ వస్తోంది, వరుసగా నాలుగో నెల రిజర్వ్ బ్యాంక్ 4 శాతం లక్ష్యాన్ని మించింది. ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరింది, ఆహార ధరలు ఎక్కువ వాటా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం (6.08 శాతం) పట్టణాల (4.88 శాతం) కంటే ఎక్కువ; ఉల్లి ధరలు గత ఏడాదితో పోలిస్తే 108 శాతం పెరిగి రెట్టింపయ్యాయి. 2026-27కు ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనా 5.2 శాతం. వడ్డీ రేట్లు పెంచడం వంటి ద్రవ్య విధాన చర్యలతో ద్రవ్యోల్బణానికి పూర్తిగా పగ్గాలు బిగించడం కుదరదు; అందుకే సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వాల క్రియాశీలక జోక్యం ఇప్పుడు అనివార్యం. పశ్చిమాసియా ఘర్షణలతో భారత ముడిచమురు దిగుమతుల బిల్లు తడిసిమోపెడవుతోంది: గత ఏడాది ఏప్రిల్-ఆగస్టులో 5,040 కోట్ల డాలర్లుగా ఉన్న ఆ వ్యయం ఈ ఏడాది అదే ఐదు నెలల్లో 7,480 కోట్ల డాలర్లకు పెరిగింది.

అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఒడుదొడుకుల కారణంగా తయారీ, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దేశంలో 70 శాతానికి పైగా సరకు రవాణా రహదారుల ద్వారానే జరుగుతోంది, ఆ ఖర్చులో దాదాపు 42 శాతం ఇంధనానికే వెళ్తుంది. కాబట్టి డీజిల్, పెట్రోల్ రిటైల్ ధరలు పెరిగితే ఆహార ఉత్పత్తులు, నిత్యావసరాలు ఖరీదవుతాయని క్రిసిల్ నివేదిక కొన్ని నెలల క్రితమే హెచ్చరించింది; లీటరు చమురు ధర పది రూపాయలు పెరిగితే వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 48 బేసిస్ పాయింట్ల మేర పెరుగుతుందని అది లెక్కగట్టింది. పెట్రోల్, డీజిల్‌పై పన్నులను పరిమితం చేసి, లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెడితేనే ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుంది. అయితే ఇంధన పన్నులు ప్రభుత్వ ఆదాయంలో పెద్ద భాగం కాబట్టి, తగ్గించడం ఆర్థిక క్రమశిక్షణకు సవాలుగా మారే అవకాశం ఉందన్నదీ నిజమే; సమతుల్యమైన, లక్షిత చర్యలు అవసరం. ఇంకో వైపు ఆహార ధాన్యాల పరిస్థితిపై ప్రభుత్వ వర్గాలు సానుకూల చిత్రం ఇస్తున్నాయి: రికార్డు స్థాయి ఉత్పత్తి, ప్రభుత్వం వద్ద గణనీయమైన నిల్వల వల్ల గత ఏడాది కాలంగా ధాన్యాల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఇది ఉపశమనకరమే, ముఖ్యంగా ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద 81 కోట్ల మందికి ఉచిత ధాన్యం అందుతున్న నేపథ్యంలో. కానీ బియ్యం సహా పలు నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయని, కూరగాయలు, పండ్ల ధరలు నింగిని తాకుతున్నాయని సామాన్యులు చెబుతున్నారు. ఈ రెండు చిత్రాల మధ్య అంతరమే సమస్య: మొత్తం ఉత్పత్తి, నిల్వలు ఉన్నా, అవి వంటింటికి చేరే క్రమంలో ధరలు పెరుగుతున్నాయి. ఎల్ నినో వల్ల ఆహార ద్రవ్యోల్బణం మరింత పెరిగే ముప్పు ఉంది; ఈ ఏడాది రుతుపవనాలు సాధారణం కంటే 13 శాతం తక్కువగా ముగియడం కూడా ఆందోళనకరం. అయితే ద్రవ్యోల్బణానికి వాతావరణ మార్పులే ఏకైక కారణం కాదు. దేశవ్యాప్తంగా సుమారు ఇరవై పంటలనే ఎక్కువగా పండిస్తుండటం, వాటిలోనూ కొన్ని రకాలు అతికొద్ది రాష్ట్రాల్లోనే అధికంగా సాగవుతుండటం సమస్యాత్మకం; వంటనూనెలు, పప్పుధాన్యాలకు దిగుమతులపై ఆధారపడటం అదనపు ఇబ్బంది. జాతీయ స్థాయి సేద్య ప్రణాళికతో పంటల వైవిధ్యాన్ని పెంచడం, నిల్వ వసతులు పెంచి పంట వృథాను అరికట్టడం, ఉత్పత్తి నుంచి వినియోగదారుని వరకు సరఫరా గొలుసును బలోపేతం చేయడంపై ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తేనే దీర్ఘకాలంలో దేశానికి లబ్ధి కలుగుతుంది.

ధరల భారంతో పాటు సామాన్యుడి పొదుపును మరో రూపంలో హరిస్తున్న ముప్పు ఆన్‌లైన్ మోసాలు. ద్రవ్యోల్బణం "అదృశ్య పన్ను" అయితే, సైబర్ మోసాలు "అదృశ్య దోపిడీ". ఆదాయం చాలక, అప్పులు, "తొందరగా డబ్బు" ఆశలు పెరిగినప్పుడు, మోసగాళ్లు వాటినే ఎరగా వేస్తారు: అధిక రాబడుల పెట్టుబడి పథకాలు, తక్షణ రుణ యాప్‌లు, నకిలీ తగ్గింపు ఆఫర్లు, ప్రభుత్వ పథకాల పేరుతో నకిలీ లింకులు, "డిజిటల్ అరెస్ట్" బెదిరింపులు. పీఐబీ గణాంకాల ప్రకారం, 2021 నుంచి 2025 వరకు జాతీయ సైబర్ నేర నివేదిక పోర్టల్‌లో 65.9 లక్షలకు పైగా ఆర్థిక మోసాల ఫిర్యాదులు నమోదయ్యాయి, నష్టం 55,000 కోట్ల రూపాయలకు పైగా; కానీ ఎఫ్ఐఆర్‌లు 1.96 లక్షలే (సుమారు 3 శాతం), స్తంభింపజేసిన మొత్తం 8,189 కోట్లు (సుమారు 15 శాతం) (ఈ నిష్పత్తులు నా లెక్క). ఈ ఏడాది జూన్ 30 నాటికి 32.8 లక్షల ఫిర్యాదుల్లో 11,158 కోట్ల రూపాయలను కాపాడామని ప్రభుత్వం చెబుతోంది, ఇది విజయమే, కానీ నష్టంతో పోలిస్తే తక్కువ. మరి సాంకేతికత ఇంత ముందుకు వెళ్తున్నా మోసాలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నాం? మోసగాళ్లు నియంత్రణ వ్యవస్థల కంటే వేగంగా కొత్త పద్ధతులు కనిపెడుతున్నారు; మోసం సొమ్ము చేతులు మారే 'మ్యూల్' బ్యాంకు ఖాతాలను సకాలంలో గుర్తించలేకపోతున్నాం; యూపీఐ వేగంలో డబ్బు క్షణాల్లో మాయమవుతుంది, ఫిర్యాదు చేసేలోపే అది విదేశాలకు చేరవచ్చు; కొన్ని నెట్‌వర్కులు సరిహద్దులు దాటి నడుస్తున్నాయి, దర్యాప్తుకు అధికార పరిమితులున్నాయి; బ్యాంకులు, టెలికాం సంస్థలు, యాప్ వేదికల జవాబుదారీ తగినంతగా లేదు; పోలీసుల సాంకేతిక నైపుణ్యాలు, సిబ్బంది కొరత; చివరికి ప్రజల్లో డిజిటల్ అవగాహన లేకపోవడం. పరిష్కారం కూడా బహుముఖంగా ఉండాలి: అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకులే తక్షణం ఆపగలగడం, మ్యూల్ ఖాతాలపై నిజ-సమయ నిఘా, ఫిర్యాదు నుంచి ఎఫ్ఐఆర్, రికవరీ వరకు వేగవంతమైన ప్రక్రియ, వేదికలకు బాధ్యత, ప్రజలకు స్థానిక భాషల్లో అవగాహన. ప్రజలు కూడా ఈ అనిశ్చిత ఆర్థిక వాతావరణంలో అనవసర ఖర్చులు, అప్పులకు దూరంగా ఉండటం, "అసాధారణ లాభాల" వాగ్దానాలను నమ్మకపోవడం, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పకపోవడం వంటి జాగ్రత్తలతో తమను తాము కాపాడుకోవాలి. ధరల భారం, మోసాల భయం - ఈ రెండింటి నుంచి సామాన్యుడిని కాపాడటమే ప్రభుత్వాల ప్రాధాన్యత కావాలి; ఎందుకంటే వినియోగదారుడే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ■



జీవితంలో విజయం సాధించడానికి కావాల్సింది డిగ్రీలు, డబ్బు కాదు.. పట్టుదల, నేర్చుకోవాలనే తపన. వైఫల్యాలు కుంగదీయడానికి కాదు.. గెలుపు దిశగా నడిపించడానికి వస్తాయి. తప్పులు మనలోని లోపాలను చూపిస్తే, ఇబ్బందులు మనలోని సామర్థ్యాన్ని వెలికితీస్తాయి. ప్రతి అనుభవం ఒక పాఠం.. ప్రతి సవాలు కొత్త అవకాశం. అనుభవాలనే గురువులుగా స్వీకరించినప్పుడే నిజమైన జ్ఞానం మన సొంతమవుతుంది. నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉన్నచోటే సృజనాత్మకతకు బీజం పడుతుంది. పరిపూర్ణత అనేది ఒక్కరోజులో సాధించేది కాదు.. నిరంతర సాధనతో సానపడే నైపుణ్యం. డబ్బు విజయానికి సాధనం కావచ్చు.. కానీ పట్టుదల, జ్ఞానం, అనుభవాలే విజయానికి అసలైన పునాదులు!

-మహాదేవ

## వింతల్లో వింతలు

### లైబ్రరీలో 'తేనె' దొంగ!



'విన్నీ ది ఫూహ్' పుస్తకానికి సరిగ్గా వందేళ్లయిన అక్టోబర్ 14న, తెల్లవారుజామున 6 గంటలకు కాలిఫోర్నియా మామత్ లేక్స్ లైబ్రరీలోకి ఓ నల్ల ఎలుగుబంటి చొరబడింది! సిబ్బంది స్నాక్ నిల్వల దగ్గరికి నేరుగా వెళ్లి పీనట్ బటర్, పీచ్ కప్పులు, కుకీలు లాగించి, "తప్పనిసరిగా" ఒక తేనె జాడీని కూడా తీసుకుంది! తర్వాత షెల్ఫులు, కొత్త పుస్తకాల విభాగం, రెఫరెన్స్ డెస్క్ చూస్తూ షికారు చేసి, తనంతటతానే వెళ్లిపోయింది. ఒక్క పుస్తకానికీ నష్టం లేదు, కానీ "తేనె జాడీ ఇంకా తిరిగి ఇవ్వలేదు" అని లైబ్రరీ చమత్కరించింది. "కొత్త 'లైబ్-ఎలుగు-రియన్' ఫూహ్ పుస్తకం కోసం వచ్చినట్టుంది!" అని అధికారులు నవ్వుకున్నారు.

# విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ పూనకం!




## 'రణబాలి' మూవీ రివ్యూ

చరిత్ర పుటల్లో మరుగునపడిపోయిన వీరుల కథలను వెండితెరపైకి తీసుకొచ్చి, వారి పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయడం గొప్ప ప్రయత్నం. ముఖ్యంగా బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఆకలి బాధలు, కరువు కాటకాలు, దోపిడీ, అణచివేత వంటి అంశాలను భావోద్వేగాలతో మేళవించి చెప్పడం అంత సులభం కాదు. అలాంటి ఒక మరుగునపడిపోయిన వీరుడి జీవితాన్ని, పోరాటాన్ని తెరపై ఆవిష్కరించిన చిత్రమే 'రణబాలి'. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించారు. బలమైన చారిత్రక నేపథ్యం, మానవీయ భావోద్వేగాలు, తిరుగుబాటు స్ఫూర్తి కలగలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించింది? భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా అంచనాలని అందుకుందా? రివ్యూలో చూద్దాం.

**కథ**

బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రాంతం తీవ్రమైన కరువును చూసిన కాలమది. రాయలసీమ ప్రాంతంలోని సింగనమల ప్రాంతానికి రక్షణగా ఉంటాడు భద్రమల్లన్న స్వామి. ఆ స్వామి ఆశీస్సులతో జన్మిస్తాడు రణబాలి (విజయ్ దేవరకొండ). తన పుట్టుకకు ఓ కారణం ఉంటుంది. తన ప్రజలను కరువు రాక్షసుడి నుంచి కాపాడటం తన కర్తవ్యం. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ రూపంలో వస్తాడు ఆ కరువు రాక్షసుడు. దేశంలో లేని కరువును సృష్టిస్తాడు. అన్నపూర్ణ అయిన ఈ దేశాన్ని ఆకలి చావులతో అలమటించేలా చేసి, ఇక్కడ పండిన ధాన్యపు రాశులను ఇంగ్లాండ్‌కు రవాణా చేసే పన్నాగం పన్నుతాడు. ఆ బ్రిటిష్ ఆకృత్యాల నుంచి రణబాలి తన ప్రజలను ఎలా రక్షించుకున్నాడు? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

**విశ్లేషణ**

చరిత్రలో మరుగునపడిపోయిన ఓ వీరుడి కథ ఇది. ఒక వ్యక్తి పోరాటం వెనుక ఉన్న ప్రజల బాధలను, ఆ కాలపు సామాజిక పరిస్థితులను ఆవిష్కరించడంతో పాటు, కథలో భాగంగా భద్రమల్లన్న జానపద గాథను దర్శకుడు మేళవించిన తీరు ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంటుంది. 'రణబాలి'లో ప్రధానంగా ఆకట్టుకునేది కథాంశం. దాని వెనుక ఉన్న మానవీయ కోణం. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను దర్శకుడు కొన్ని సన్నివేశాల్లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కరువు కారణంగా ఆకలితో అలమటించే ప్రజలు, తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వారు పడే తపన, జీవనం కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. తెరపై కనిపించే సన్నివేశాలు, ప్రజల కన్నీళ్లు, వారి దుర్భర జీవితాలను ప్రతిబింబించే సన్నివేశాలు కథకు వాస్తవికతను తీసుకొస్తాయి. చరిత్రలోని ఒక చీకటి అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఈ చిత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుంది. రణబాలి పుట్టుక, భద్రమల్లన్న నేపథ్యం, ఊర్లో జాతర, అక్కడ రణబాలిపై జరిగిన దాడి, తొలి యాక్షన్ ఘట్టం.. ఇవన్నీ ప్రేక్షకుడిని కథలో లీనం చేస్తాయి. జయమ్మ పాత్రలో రష్మిక పరిచయం, పెళ్లి తర్వాత వచ్చే సన్నివేశాలు హత్తుకునేలా ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ తర్వాత కూడా కథ మరింత తీవ్రతతో సాగుతుంది. బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని రణబాలి తిరిగి తీసుకొచ్చి ప్రజలకు అందించే ఎపిసోడ్‌లో అతని పోరాట స్ఫూర్తి మరో స్థాయిలో నిలుస్తుంది. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ కదిలిస్తాయి. ఈ సన్నివేశాలు కథలోని మానవీయ భావోద్వేగాలను మరింత అందంగా ఆవిష్కరిస్తాయి. ఇక చివర్లో భద్రమల్లన్న స్వామి పాత్రను ఉపయోగించుకున్న తీరు థియేటర్లలో పూనకం తెప్పిస్తుంది.

**నటీనటుల నటన**

రణబాలి పాత్ర విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. నటుడిగా తనను మరో స్థాయిలో నిలబెట్టిన ప్రదర్శన కనబరిచారు. పాత్రలోని తీవ్రత, ఆవేశం, పోరాట స్ఫూర్తిని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ సందర్భాల్లోనూ పాత్రకు పూర్తి న్యాయం చేశారు. రష్మిక జయమ్మ పాత్రలో సహజంగా కనిపిస్తూ మెప్పించారు. విజయ్ దేవరకొండతో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు అందంగా, హత్తుకునే భావోద్వేగాలతో సాగుతాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు మంచి ఆకర్షణగా నిలుస్తుంది. ఈశ్వరి రావు పాత్ర కథకు మరింత బలాన్ని తెచ్చింది. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ పాత్రలో కావాల్సిన క్రూరత్వం కనిపించింది. కథలోని సామాజిక, చారిత్రక నేపథ్యానికి అనుగుణంగా మిగతా పాత్రలు కూడా తమ వంతు సహకారం అందించాయి.

**టెక్నికల్ విభాగం**

చరిత్రలో మరుగునపడిపోయిన ఒక వీరుడి కథను ఎంచుకోవడం, దాని వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను తెరపైకి తీసుకురావడంలో రాహుల్ సాంకృత్యన్ అద్భుతమైన పనితీరు కనబరిచారు. ప్రజల బాధలు, తిరుగుబాటు స్ఫూర్తి, జానపద గాథ వంటి భిన్నమైన అంశాలను ఒకే కథలో చక్కగా మేళవించారు. కొన్ని భావోద్వేగ సన్నివేశాలను హృద్యంగా తెరకెక్కించడం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులను సంభాషణలు, సంఘటనల ద్వారా వాస్తవానికి దగ్గరగా తీయడం అభినందనీయం. చారిత్రక నేపథ్యానికి తగిన నిర్మాణ విలువలతో సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. కెమెరా వర్క్ కూడా టాప్ క్వాలిటీతో ఉంది. ఎడిటింగ్ ఇంకాస్త పదునుగా ఉండొచ్చు. అలాగే, అజయ్--అతుల్ కొన్ని చోట్ల మరింత బలంగా నేపథ్య సంగీతాన్ని ఇచ్చే అవకాశాన్ని చేజార్చుకున్నారనిపించింది.

**ప్లస్ పాయింట్స్**

బలమైన చారిత్రక కథాంశం
విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ నటన
విజయ్ దేవరకొండ--రష్మిక మందన్న సన్నివేశాలు
ఇంటర్వెల్ సీక్వెన్స్, క్లైమాక్స్
భావోద్వేగ ఘట్టాలు
భద్రమల్లన్న జానపద గాథ

**మైనస్ పాయింట్స్**

అక్కడక్కడా నెమ్మదైన కథనం
నేపథ్య సంగీతం

ఫైనల్‌గా: చరిత్రలో జరిగిన సంఘటనలను కమర్షియల్ హిస్టారికల్ ఫిక్షన్‌గా మలిచిన తీరు ఆద్యంతం ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, రాహుల్ సాంకృత్యన్ కెరీర్లలో ఈ చిత్రం గుర్తుండిపోయే స్థానాన్ని సంపాదించుకుంటుంది. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించే అవకాశం పుష్కలంగా ఉంది.

**రేటింగ్: 3.5/ 5**

# రా అండ్ రస్టిక్ యాక్షన్ లవ్ స్టోరీతో రానున్న 'డానీ'.. నవంబర్ 13న గ్రాండ్ రిలీజ్!




టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ హీరో ఆశిష్ గాంధీ, టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్‌జీ గోగణ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అంటెసిపేటెడ్ మూవీ 'డానీ'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'నాటకం' సినిమా ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే జోరుతో అంతకుమించిన ఇంటెన్సివ్ కంటెంట్‌తో ఈ కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్, క్రైమ్, రా అండ్ రస్టిక్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంపై ట్రేడ్ సర్కిల్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ స్ట్రైక్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. సినిమాలోని బోల్డ్ కంటెంట్, రా అండ్ రస్టిక్ మేకింగ్ స్టైల్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా, మనిషి జీవితంలో ఉండే అలవాట్లకు, అతను మనసారా కోరుకునే ప్రేమకు మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణే ఈ చిత్రానికి ప్రధాన హైలైట్ కానుంది. ఓ వ్యక్తి తన జీవితంలో అలవాటు చేసుకున్న పద్ధతులు అతని గమ్యభావితాన్ని ఎలా మార్చాయి? ఆ వ్యక్తి నిజమైన ప్రేమలో పడిన తర్వాత తన జీవితంలో ఎలాంటి పెనుమార్పులు వచ్చాయి? ఈ రెండు విభిన్నమైన ధోరణుల మధ్య నలిగిపోయే పాత్రల ప్రయాణం ఎలా సాగిందనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమాను అత్యంత సహజంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆశిష్ గాంధీ సరసన సేజల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తుండగా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. హీరో హీరోయిన్ల డిఫరెంట్ లుక్స్, పోస్టర్ డిజైన్ తీరు సినిమా నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ, మణికాంత్ ఎడిటింగ్ బాధ్యతలు అద్భుతంగా నిర్వర్తించారు. కొల్లి గోపాల కృష్ణ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ఖుషి, సుధాకర్ గోద సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ తోట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, రామ్ సుంకర మరియు కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రఫీ అందించగా, సాయిరామ్ జల్లా కో-డైరెక్టర్‌గా సేవలందించారు. రిథమ్ స్టూడియోస్ సౌండ్ డిజైన్ చేయగా, కోటి వర్క్స్ పబ్లిసిటీ డిజైన్స్ అందించారు. సాయి సతీష్ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ రా అండ్ రస్టిక్ రొమాంటిక్ క్రైమ్ డ్రామా 'డానీ' సినిమాను ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 13న ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# 'కుంభ'లోని శక్తిని ఇప్పుడే తట్టిలేపాలని అనుకోవడం లేదు.. పృథ్వీరాజ్ బర్త్‌డేపై రాజమౌళి ట్వీట్

టాలీవుడ్ అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా, తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పృథ్వీరాజ్ బర్త్‌డే సందర్భంగా రాజమౌళి చేసిన ట్వీట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో, అభిమానులలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే పృథ్వీ. ఈరోజు నీలోని 'కుంభ'ను తట్టిలేపాలని నేను అనుకోవడం లేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయడానికి తలరాతతో ముడిపడి ఉన్న కుంభ అతడు" అంటూ రాజమౌళి రాసుకొచ్చారు. 'కుంభ' అనేది 'వారణాసి' చిత్రంలో పృథ్వీరాజ్ పోషిస్తున్న పాత్ర పేరు కావడం విశేషం. ఈ చిత్రంలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా జోనాస్ నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని సమాచారం.

# విజువల్ వండర్‌గా 'రామాయణం' కొత్త ట్రైలర్.. శ్రీరాముడిగా రణ్‌బీర్, రావణాసురుడిగా యశ్ అదుర్స్!



ఇండియన్ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సరికొత్త ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దంగల్' వంటి ఇండస్ట్రీ హిట్ సినిమాలను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, టాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. ఇక రాకింగ్ స్టార్ యశ్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రం మొదటి భాగం నవంబర్ 5, 2026న ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని తాజా ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

# వెంకీ, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా.?



టాలీవుడ్ ప్రేక్షకులతో పాటు విక్టరీ వెంకటేశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ సినిమా మరోసారి వాయిదా పడిన సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్ 47). ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, గతంలో పలుమార్లు విడుదల తేదీ మారిన ఈ చిత్రం, తాజాగా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. మరోసారి వాయిదా పడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సినిమా చివరి దశలో సాంకేతిక పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడంతోనే విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాత నాగవంశీ వెల్లడించారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com